క్లుప్తంగా

నేటి నుంచి తిరునాళ్లు

సదుం : మండలంలోని జంగంపల్లె కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో గురువారం నుంచి తిరునాళ్ల నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. గురువారం అంకురార్పణ, 3న ధ్వజారోహణం, పూజా కార్యక్రమం, 4న ప్రత్యేక అభిషేకాలు, దేవరెద్దు పూజా కార్యక్రమం, భజనలు, కోలాటాలు, అన్నదానం ఉంటాయన్నారు. అలాగే 5వ తేదీ వేకువజామున శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించనున్నట్టు తెలియజేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఎంఈఓకి సన్మానం


ఎంఈఓ సిద్ధరామయ్యను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్ల మండల విద్యాశాఖ అధికారి సిద్ధరామయ్య గణతంత్ర దినోత్సవం నాడు కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ ఎంఈఓగా ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా పులిచెర్ల హైస్కూల్లో బుధవారం ఆయనను మండలంలోని పలువురు ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు, సూర్యనారాయణ, రవిశంకర రాజు, అల్తాఫ్ హుస్సేన్, వీరనాగయ్య, మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల ధ్వంసం


జేసీబీతో మద్యం బాటిళ్లను ధ్వంసం చేయిస్తున్న సెబ్ అధికారులు

కుప్పం: కుప్పం సెబ్ అధికారులు వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న అక్రమ మద్యం బాటిళ్లను ఆ శాఖ అసిస్టెంట్ ఎన్‌ఫోర్సుమెంట్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. బుధవారం మున్సిపాలిటీ డంపింగ్ యార్డులో 2549 మద్యం బాటిళ్లను జేసీబీతో తొక్కించారు. దీంతో పాటు 134 లీటర్ల సారాను కూడా ధ్వంసం చేశారు. సెబ్ సీఐ కిషోర్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవాదుల గుమస్తా రాజన్న మృతి



పుంగనూరు: పట్టణంలోని న్యాయవాదుల గుమస్తాగా సుమారు 50 ఏళ్లకు పైగా పని చేసిన సీనియర్ గుమస్తా రాజన్న(65) మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బుధవారం తుదిశ్వాస విడిచారు. విషయం తెలిసి న్యాయవాదులు, న్యాయవాదుల గుమస్తాలు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి, నివాళులర్పించారు.


త్వరగా ఇళ్లను పూర్తి చేయండి

సోమల: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ నాగరాజ ఆదేశించారు. ఆయన బుధవారం నెల్లిమంద పంచాయతీలోని ఎగువపల్లె, నెల్లిమంద, కంచంవారిపల్లె, కొత్త నవాబుపేట గ్రామాల్లో పర్యటించారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ ఉగాది నాటికి నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. లబ్ధిదారులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నా ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ప్రశ్నించారు. సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తేస్తే వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ జావీద్ అలీ, పంచాయతీ కార్యదర్శి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం ప్రారంభం

సోమల: గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఆధార్ కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్యాంప్రసాద్ రెడ్డి, ఎంపీడీఓ నాగరాజ కోరారు. బుధవారం నెల్లిమంద సచివాలయంలో ఎంపీపీ ఈశ్వరయ్యతో కలిసి ఆధార్ కేంద్రాన్ని వారు ప్రారంభించారు. మంత్రి పెద్దిరెడ్డి పీఏ మురళీకృష్ణారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు, సర్పంచ్ చంద్రకళ, వైస్ ఎంపీపీలు ప్రభాకర్, సయ్యద్‌బాషా, ఉప సర్పంచ్ రెడ్డెమ్మ, సచివాలయ కన్వీనర్ కేశవ పాల్గొన్నారు.

చురుగ్గా విద్యుత్ మరమ్మతు పనులు


విద్యుత్ స్తంభం ఏర్పాటు చేస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

చౌడేపల్లె: చౌడేపల్లె-పలమనేరు మార్గంలోని దాదేపల్లె వద్ద విద్యుత్ స్తంభాలు, లైన్ల ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతున్నాయి. మంగళవారం రోడ్డు పక్కన ఉన్న 11కేవీ విద్యుత్ స్తంభానికి ట్రాక్టర్ అదుపుతప్పి ఢీకొన్న సంఘటన విషయం తెలిసిందే. స్తంభం నేలకొరగడంతో సమీపంలోని నాలుగు గ్రామాలకు రాత్రి నుంచి విద్యుత్ లేక అవస్థలు పడ్డారు. స్పందించిన ట్రాన్స్‌కో ఏఈ రాజశేఖర్ ఆధ్వర్యంలో బుధవారం యుద్ధ ప్రాతిపదికన స్తంభాలను ఏర్పాటుచేసి, కొత్తలైన్లు లాగారు. సమస్యను పరిష్కరించిన ట్రాన్స్‌కో సిబ్బందికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

బీసీల సంక్షేమం వైఎస్సార్‌సీపీకే సాధ్యం

- యువగళం పాదయాత్రలో పదుల సంఖ్యలో కూడా కనిపించని ప్రజలు
- అందుకే లోకేష్ ప్రజలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్నాడు
- అసలు పాదయాత్ర ఎందుకు చేస్తున్నాడో ఆయనే తెలపాలి
- రాజంపేట ఎన్నికల పరిశీలకుడు : బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి


విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి

బైరెడ్డిపల్లి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కులమతాలకు, పార్టీలకు సంబంధం లేకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, కానీ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 14 ఏళ్ల పరిపాలనలో అభివృద్ధి శూన్యమని వైఎస్సార్ సీపీ కార్యదర్శి, రాజంపేట ఎన్నికల పరిశీలకులు బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి అన్నారు. బైరెడ్డిపల్లెలో బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు పాలన సాగినంత కాలం వర్షాలు లేక ప్రజలు కరువుతో నరకం చూశారన్నారు. ప్రస్తుతం నారా లోకేష్ చేస్తున్న యువగళం పాదయాత్రలో పదుల సంఖ్యలో కూడా ప్రజలు కరువయ్యేసరికి రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్నారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి జరగలేదని చెబుతున్న లోకేష్‌బాబు గ్రామాల్లోకి వెళ్లి చూస్తే తెలుస్తుందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వైద్యశాలలు, సీసీరోడ్లు, మినీ పాలకేంద్రాలు, నాడు-నేడు పథకం ద్వారా అదనపు తరగతిగదులు నిర్మిస్తుండడం టీడీపీ నేతలకు కనిపించలేదా అని ప్రశ్నించారు. చంద్రబాబు పరిపాలనలో కేవలం జన్మభూమి కమిటీ సభ్యులకు మాత్రమే సంక్షేమ పథకాలు అందాయని గుర్తు చేశారు. బీసీల సంక్షేమం, బీసీల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏకంగా కార్పొరేషన్లను ఏర్పాటు చేసిందన్నారు. మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించి చిత్తశుద్ధితో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. లోకేష్‌బాబు ఎందుకు పాదయాత్ర చేస్తున్నాడో ప్రజలకు వివరించకుండా, ప్రభుత్వంపై నిందలు వేస్తుండడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రశాంతంగా ఉన్న బైరెడ్డిపల్లెలో లోకేష్ పాదయాత్ర వల్ల ఉద్రిక్త వాతావరణం నెలకొందన్నారు. టీడీపీ నేతలే బ్యానర్లు చింపి తమపై బురదజల్లుతున్నారని ఆయన ఆరోపించారు. టీడీపీ నేతలు ఎన్ని కల్లిబొల్లి మాటలు చెప్పినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. సమావేశంలో సర్పంచులు వెంకటేష్, రవిచంద్రబాబు, రమణారెడ్డి, చంద్రమళి, ఎంపీటీసీలు నాగరాజు, వినాయకం, నేతలు జయకుమార్, అమరనాథరెడ్డి, కుమార్, చంద్రశేఖర్, ఖాదర్‌బాష, నాగభూషణంరెడ్డి, కుమార్, సుధాకర్ పాల్గొన్నారు.

అమ్మాయాక్స్ సంస్థ సేవలు మరువలేనివి


వాటర్‌ప్లాంటును ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: అమ్మాయాక్స్ సంస్థ ప్రజలకు అందిస్తున్న సేవలు మరువలేనివని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. బుధవారం పట్టణంలో అమ్మాయాక్స్ సంస్థ వారు ఏర్పాటు చేసిన మంచినీటి ప్లాంటును ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యువరాజు, సర్పంచ్ పీఎస్ లక్ష్మి, మండల కన్వీనర్ బాలగురునాథ్, సింగిల్‌విండో చైర్మన్ గోపిరెడ్డి, మండల నాయకులు, పలువురు హాజరయ్యారు.

నీటి వనరులను సంరక్షించుకోవాలి


అమృత్ సరోవర్ పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ ఈశ్వరయ్య

సోమల: నీటి వనరుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ ఈశ్వరయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు అన్నారు. బుధవారం నెల్లిమంద పంచాయతీలోని కనగలకుంట వద్ద ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకంలో భాగంగా అమృత్ సరోవర్ పూడికతీత పనులను పూజ చేసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎందుకూ పనికిరాని ప్రభుత్వ భూములను ఉపయోగంలోకి తీసుకురావాలన్న ఉద్దేశంతో చెరువుల్లాగా ఏర్పాటు చేసి వర్షపు నీరు వృథాగా పోకుండా చుట్టుపక్కల ఉన్న రైతులకు ఉపయోగపడే విధంగా నీటిని నిల్వ చేయడమే అమృత్ సరోవర్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. దీనిని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పకడ్బందీగా రీసర్వే చేయాలి..

భూముల రీసర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీపీ ఈశ్వరయ్య అన్నారు. బుధవారం నెల్లిమంద పంచాయతీలో జరుగుతున్న రీసర్వేను ఆయన పరిశీలించారు. రీసర్వేతో భూముల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. మంత్రి పెద్దిరెడ్డి పీఏ మురళీకృష్ణారెడ్డి, సర్పంచ్ చంద్రకళ, ఉపసర్పంచ్ రెడ్డెమ్మ, తహసీల్దార్ శ్యాంప్రసాద్ రెడ్డి, ఎంపీడీఓ నాగరాజ, ఏపీఓ దినకర్ బాబు, వైస్ ఎంపీపీలు సయ్యద్ బాషా, ప్రభాకర్, డీటీ ప్రకాష్ బాబు, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు అమాస మోహన్, నాగేశ్వరరావు, వీఆర్ఓ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్రకు కరువైన జనం

- యాత్రలో సొంత సెక్యూరిటీ, బౌన్సర్లు, పసుపు, ఎరుపురంగు చొక్కాల వారే అధికం
- టీడీపీ శ్రేణులు ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా రాని ప్రజలు


లోకేష్ పాదయాత్రలో కనిపించని సామాన్య జనం

పలమనేరు: నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు జనం కరువయ్యారు. బుధవారం ఆయన చేపట్టిన పాదయాత్ర పలమనేరు నియోజకవర్గంలోని బైరెడ్డిపల్లి మండలం ఇల్లూరు ఇండ్లు నుంచి సాకేవూరు, బేలుపల్లి క్రాస్, కొలమాసనపల్లి, గొల్లపల్లి, మొరం, క్యాటిల్‌ఫామ్ మీదుగా సాగింది. ఎలాగైనా జనాన్ని రప్పించాలని స్థానిక టీడీపీ నేతలు కుల సంఘాలను రప్పించినా జనం రాలేదు. ఎన్ని ఎత్తులేసినా జనం రాకపోవడంతో టీడీపీ శ్రేణులు చెప్పుకోలేని బాధపడుతున్నట్టు తెలుస్తోంది. ఆయన ప్రసంగాలకు జనం చప్పట్లు కొట్టాలని టీడీపీ నాయకులు సైగ చేస్తున్నా జనం నుంచి స్పందన రావడం లేదు. పాదయాత్రలో వస్తున్న వారిలో సొంత సెక్యూరిటీ సిబ్బంది, బౌన్సర్లు, పచ్చ చొక్కాలు వేసుకున్న నాయకులు, యువగళం ఎర్ర డ్రస్ వేసుకున్న వారు పోతే సామాన్య జనం పెద్దగా కనిపించలేదు. పాదయాత్రకు వస్తున్న వారు సైతం తాము సెల్ఫీ కోసం వచ్చాం తప్ప పార్టీకోసం కాదని చెబుతుండడం గమనార్హం.

నేటి నుంచి గడపగడపకు..

వి.కోట: మండలంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వెంకటేగౌడ నేతృత్వంలో గురు, శుక్రవారాల్లో రెండురోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ యువరాజు తెలిపారు. బుధవారం ఆయన మండలంలోని ముదరందొడ్డి పంచాయతీ గ్రామ సచివాయాల పరిధిలోని ప్రజాప్రతినిధులు, అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గురువారం బాలింత్రాలబండ, వీజీతోపు, మద్దిమాకులపల్లి, చింతకాయలబండ గ్రామాల్లో ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందన్నారు. శుక్రవారం నడమంత్రం పరిధిలోని గ్రామాల్లో పర్యటిస్తారన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

11న జాతీయ లోక్‌అదాలత్

పుంగనూరు: పట్టణంలోని కోర్టు ఆవరణలో ఈ నెల 11న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్‌జడ్జి వాసుదేవరావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 11న జరిగే లోక్‌అదాలత్‌లో రాజీకి అనుకూలమైన సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరిస్తామన్నారు. అధికారులు, న్యాయవాదులు, కక్షిదారులు సమన్వయంతో పని చేసి అధిక సంఖ్యలో కేసులు పరిష్కరించేందుకు సహకరించాలని కోరారు.

నేడు గ్రామసారథుల సమావేశం

పుంగనూరు: పుంగనూరు మండల గ్రామసారథుల నియామకం, ఎంపిక కార్యక్రమాన్ని గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ గ్రామసారథుల సమావేశానికి పరిశీలకులు జింకా వెంకటాచలపతి అతిథిగా హాజరవుతున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి జెడ్పీటీసీతో పాటు ప్రజాప్రతినిధులు, పార్టీ ప్రతినిధులు తప్పక హాజరు కావాలని కోరారు.

సింగిల్‌విండో అధ్యక్షుడిగా ఓబుల్ రెడ్డి


నియామకపత్రం అందుకుంటున్న ఓబుల్ రెడ్డి

పెద్దపంజాణి: పెద్దపంజాణి సింగిల్‌విండో అధ్యక్షుడిగా సంపల్లి గ్రామానికి చెందిన రెడ్డివారి ఓబుల్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో బుధవారం ప్రభుత్వం నుంచి వచ్చిన నియామక పత్రాన్ని సహకార శాఖ అధికారులు ఆయనకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే వెంకటేగౌడ సహకారంతో సహకార సంఘాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానన్నారు. తనకు పదవి రావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ భాగారెడ్డి, వైస్ ఎంపీపీ జీడీ బాబు, పుంగనూరు ఏఎంసీ చైర్మన్ నాగరాజ రెడ్డి, సర్పంచ్ మురళి, నాయకులు జాఫర్, రెడ్డిబాషా పాల్గొన్నారు.

రూ.7 లక్షలకు రిబేటు పెంపుపై హర్షం

పలమనేరు: చాలా ఏళ్ల తర్వాత కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బుధవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆదాయపు పన్ను రిబేటును పెంచడం ఉద్యోగవర్గాలకు ఊరటనిచ్చే అంశమని పలమనేరు మేధావుల ఫోరం కన్వీనర్ సోమచంద్రారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గతంలో రూ.5లక్షల దాకా ఆదాయపు పన్ను లేకపోగా ఇప్పుడు రూ.7 లక్షలకు పెంచడం మంచి విషయమన్నారు. తద్వారా ఉద్యోగులకు మేలు చేసినట్టేనని అందులో తెలిపారు.

సులభంగా గంగమ్మ దర్శనభాగ్యం

- ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా పార్కు
- బోయకొండలో అభివృద్ధి పనులను పరిశీలించిన రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి



బోయకొండలో అధికారులకు సూచనలిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి

చౌడేపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ దర్శనార్థం వచ్చే భక్తులకు సులభంగా అమ్మవారి దర్శనభాగ్యం కల్పించేలా చర్యలు తీసుకున్నామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచనల మేరకు బోయకొండ గంగమ్మ ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన క్యూలైన్లను, వివిధ అభివృద్ధి పనులను చైర్మన్ మిద్దెంటి శంకర్‌నారాయణతో కలిసి పరిశీలించారు. తొలుత అమ్మవారిని దర్శించుకుని ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం వద్ద ఉపాధి హామీ నిధులతో ఏర్పాటుచేసిన పార్కును మరింత ఆకర్షణీయంగా, ఆహ్లాదకర వాతావరణం తలపించేలా తీర్చిదిద్దాలని ఈఓ చంద్రమౌళికి సూచించారు. పరిసరాలు శుభ్రంగా ఉండేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. కొండపై ప్లాస్టిక్ రహిత ఆలయంగా మార్చు తేవడానికి ప్రతిఒక్కరూ బాధ్యతగా సహకరించాలని కోరారు. వాహనాల పార్కింగ్ సమస్యను నిరోధించడానికి ఏర్పాటుచేసిన ప్రాంతాల్లోనే భక్తులు వాహనాలను పార్కింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చే యాత్రికులకు సులభతరంగా దర్శనం పొందేలా ఏర్పాటు చేసిన సేవా వివరాలను ప్రదర్శించేలా బోర్డులు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఇంకా అవసరమైన పనులకు అంచనాలు సిద్ధం చేసి మంత్రి దృష్టికి తీసుకెళ్లడానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రోడ్డుకు ఇరువైపులా పెంచిన మొక్కల సంరక్షణపై చర్చించారు. కార్యక్రమంలో నేతలు మల్లికార్జునరెడ్డి, సురేంద్రరెడ్డి, నవీన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

గృహనిర్మాణ పనులు వేగవంతం చేయండి


గృహనిర్మాణ పనులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ హరినారాయణన్

వి.కోట: గృహనిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. బుధవారం ఆయన మండలంలోని కద్రిపల్లి జగనన్న లేఅవుట్‌లో గృహనిర్మాణ పనులను మండల అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గృహనిర్మాణ పనుల వేగవంతానికి అధికారులు లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. నిర్మాణ పనులు చేపట్టడానికి అవసరమయ్యే నగదును వెలుగు సంఘాల ద్వారా మంజూరు చేయాలని ఆదేశించారు. ఎంపీడీఓ బాలాజీ, ఎంపీపీ యువరాజు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

వేకువజామున నుంచే పెన్షన్ల పంపిణీ


పుంగనూరు: పెన్షన్లు పంపిణీ చేస్తున్న చైర్మన్ అలీమ్‌బాషా


పుంగనూరు: పెన్షన్లు పంపిణీ చేస్తున్న వక్ఫ్‌బోర్డు చైర్మన్ అమ్ము

పుంగనూరు: పట్టణంలో బుధవారం వేకువజామునే పెన్షన్ల పంపిణీని అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. పట్టణంలోని కొత్తపేటలో మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి పలువురికి పింఛన్ పంపిణీ చేశారు. అలాగే మేలుపట్లలో వైస్ చైర్మన్ సీఆర్ లలిత, ఉబేదుల్లా కాంపౌండులో వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలంలోని మంగళం గ్రామంలో ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి పెన్షన్ పంపిణీని ఆరంభించారు. మొదటి రోజే సుమారు 97 శాతం పెన్షన్ల పంపిణీ అయింది. కౌన్సిలర్లు మమత, లక్ష్మణ్‌రాజు, రేష్మా, సాజిదాబేగం, మహబూబ్ బాషా, పూల త్యాగరాజు, భారతి, జయభారతి పాల్గొన్నారు.

సదుం: మండలంలో 18 పంచాయతీల పరిధిలో బుధవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. వేకువజామున నుంచే స్థానిక సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, వార్డు సభ్యులు పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

81 శాతం పింఛన్ పంపిణీ

కుప్పంరూరల్: మండల పరిధిలో బుధవారం సాయంత్రానికి 81 శాతం పంపిణీ పూర్తి కాగా, సాంకేతిక కారణాలతో మిగతా 19శాతం మందికి అందించలేకపోయినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ జానకమ్మ తెలిపారు. బుధవారం వేకువజామున నుంచే వలంటీర్లు పింఛన్ పంపిణీ ప్రారంభించారన్నారు. 2, 3 తేదీల్లో మిగిలిన వారికి పింఛన్ పంపిణీ చేయనున్నట్లు ఆమె చెప్పారు.


దయాలసిస్ రోగికి పింఛన్ అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ డా.సుధీర్

కిడ్నీ బాధితురాలికి..

పట్టణంలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న బాధితురాలు మల్లికమ్మకు మున్సిపల్ చైర్మన్ డా.సుధీర్ బుధవారం ప్రభుత్వం డయాలసిస్ బాధితులకు అందించే రూ.10 వేల పింఛన్‌అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవిరెడ్డి, వైస్ చైర్మన్ మునుస్వామి తదితరులు పాల్గొన్నారు.

సోమల: మండల కేంద్రంలోని లింగాపురం వీధిలో గృహసారథులతో కలిసి బుధవారం వైఎస్సార్‌సీపీ మండల యూత్ అధ్యక్షుడు వరదం కుమార్ రాజ పలువురు లబ్ధిదారులకు పింఛన్ అందజేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా యూత్, మైనారిటీ ప్రధాన కార్యదర్శులు ఐలా సూరి, ఇక్బాల్ పాల్గొన్నారు.

క్రీడాపోటీలకు ఎంపికైన విద్యార్థులకు అభినందనలు


క్రీడాకారులకు ప్రోత్సాహక బహుమతిని అందజేస్తున్న జెడ్పీటీసీ దామోదర్‌రాజు

చౌడేపల్లె: మారుమూల పల్లెటూరు పుదిపట్ల ఉన్నత పాఠశాల నుంచి జాతీయ స్థాయి, రాష్ట్రస్థాయి కబడ్డీ జట్లకు విద్యార్థులు ఎంపిక కావడం అభినందనీయమని, వీరిని మిగతా స్కూళ్ల విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో క్రీడాపోటీలకు ఎంపికైన పుదిపట్ల ఉన్నత పాఠశాల విద్యార్థులతో సమావేశం జరిగింది. ఒకే పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులు క్రీడాపోటీలకు ఎంపిక కావడం గర్వకారణమని జెడ్పీటీసీ కొనియాడారు. విద్యలోనే కాకుండా క్రీడా రంగంలో పుదిపట్లకు ఉన్నత గుర్తింపు సాధించడానికి కృషి చేసిన శిరీష, హర్షిత, శ్వేతశ్రీ, సుస్మిత, సంపూర్ణను అభినందించి సన్మానించారు. క్రీడాసామగ్రి కొనుగోలుకు రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని ఆయన అందజేశారు. హెచ్‌ఎం పద్మజ మాట్లాడుతూ జనవరి 23 నుంచి 25 వరకు విజయనగరం జిల్లా నెలిమర్ల మండలం అలుగోలు ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో చిత్తూరు జిల్లా జట్టు తరఫున ఈ ఐదుగురు పాల్గొని తృతీయస్థానం కైవసం చేసుకున్నారని తెలిపారు. త్వరలో జాతీయస్థాయి పోటీల్లో తలపడనున్నట్లు చెప్పారు. క్రీడాకారులను, పీడీ వెంకటేష్‌ను వారు అభినందించారు. ఉపాధ్యాయులు, చౌడేపల్లె ఉపసర్పంచ్ అల్తాఫ్, రమేష్, త్రిలోక్ ఉన్నారు.

మంత్రి పర్యటనను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి

రొంపిచెర్ల : పల్లెబాట కార్యక్రమంలో భాగంగా మండలంలో ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు నిర్వహించే మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 3వ తేదీన గానుగచింత, మోటమల్లెల, బోడిపాటివారిపల్లె, 4న బండకిందపల్లె, పెద్దగొట్టిగల్లు, చల్లావారిపల్లె, బొమ్మయ్యగారిపల్లె , 5న రొంపిచెర్ల, జాండ్లవారిపల్లె, పెద్దమల్లెల, చిచ్చిలివారిపల్లె, చెంచెంరెడ్డిగారిపల్లె పంచాయతీలలో మంత్రి పర్యటిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పల్లు అభివృద్ధి పథకాలు ప్రారంభోత్సవం, శంఖుస్థాపనలు చేస్తారని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, మంత్రి పీఏ మునితుకారం, ఎంపీడీఓ రాజేంద్ర, తహసీల్దార్ అమరనాథ్, పీహెచ్‌సీ డాక్టర్ రాజ, ఏఈలు, సర్పంచ్‌లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగును ప్రోత్సహించండి


రైతులతో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ మేఘస్వరూప్


పొలంబడి కార్యక్రమాన్ని పరిశీలిస్తు ట్రైనీ కలెక్టర్ మేఘస్వరూప్

శాంతిపురం: తక్కువ పెట్టుబడి, తక్కువ నీటితో సాగయ్యే అపారమైన పోషక విలువలు ఉన్న చిరుధాన్యాల సాగును వ్యవసాయ శాఖ విస్తారంగా ప్రోత్సహించాలని ట్రైనీ కలెక్టర్ మేఘస్వరూప్ కోరారు. జాతీయ ఆహార భద్రత మిషన్ పథకం కింద రాగి పంట సాగులో ఉన్న కొలమడుగులో క్లస్టర్ రైతులతో బుధవారం సమావేశమయ్యారు. ప్రపంచ దేశాలు 2023ను చిరుధాన్యాల సంవత్సరంగా పాటిస్తున్న నేపథ్యంలో చిరుధాన్యాల కోసం అనేక దేశాలు భారతదేశం వైపు చూస్తున్నాయని తెలిపారు. చిరుధాన్యాలతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలను జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా వివరించారు. రాగి పంట సాగు, సస్యరక్షణ పద్ధతులను పలమనేరు ఏడీఏ అన్నపూర్ణమ్మ రైతులకు వివరించారు. ఈ సందర్భంగా రైతులకు 50 శాతం రాయితీతో పీఎస్‌బీ ద్రావణాన్ని అందించారు.ఏఓ అప్పోజి, స్థానిక ఎంపీటీసీ దేవేంద్రప్ప, సర్పంచ్ మంజునాథ్, ఆర్బీకే ఇన్‌చార్జ్ రామ్మూర్తి పాల్గొన్నారు.

వైఎస్సార్ పొలంబడి పరిశీలన

పలమనేరు: మండలంలోని టి.వడ్డూరు రైతుభరోసా కేంద్ర పరిధిలో సాగుతున్న వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని అసిస్టెంట్ కలెక్టర్ మేఘస్వరూప్ బుధవారం పరిశీలించారు. గ్రామంలోని కంబిరెడ్డి పొలంలో 14 వారాల పాటు పొలంబడి కార్యక్రమాన్ని స్థానిక వ్యవసాయశాఖ నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను స్థానిక ఏడీ అన్నపూర్ణదేవి ఆయనకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్‌బాష, ఏడీఏ మధుసూదన్‌రెడ్డి, ఆత్మా చైర్మన్ గోవిందురెడ్డి, ఆర్బీకే ఇన్‌చార్జ్ సింధు, రైతులు పాల్గొన్నారు.